స్థిరత్వంలేని ఓ మామయ్య చిత్రవిచిత్ర ప్రవర్తన?

ఎమ్మెస్సార్ కథ

# కోతిమామయ్య

"చలపతీ! ఓయ్ చలపతీ!" కొంపలంటుకుపోతున్నట్టు పిలుస్తూ పెద్దగా తలుపు తట్టాడు మామయ్య.

మామూలు విషయానికి— అలా కొంప లంటుకుపోతున్నట్టు పిలవడం లాంటి పనులు చేయడంవల్లనే ఈ మామయ్యని అందరు — కోతి మామయ్య అని అంటుంటాం. ఈ రాజారాం మామయ్య స్వయంగా మా అమ్మకు తమ్ముడు కావడం మూలానా మేమంతా 'మామయ్యా' అని పిలుస్తాం కానీ— ఆయన చేష్టలెరిగిన వారందరూ అతన్ని (ఊళ్ళో అందరూ) కోతి మామయ్యా అనే పిలుస్తారు.

"కాలింగ్ బెల్ నొక్కొచ్చుగదా మామయ్యా?" అన్నాను... నొచ్చుకుంటున్నట్టు. నావైపు కోతిలాగానే కొరకొర కోపంగా చూసి— "ఒరేయ్... నువ్వు నాకంటే పదేళ్ళు చిన్నవాడివి... నాకు చెప్పొచ్చావట్రా! కాలింగ్ బెల్ ఎవరు నొక్కాలో తెలుసా!... పరిచయం లేనివాళ్ళు, చనువులేని వాళ్ళు నొక్కాలి... కాలింగ్ బెల్ నొక్కితే ఎవరో అల్లాటప్పాగాళ్ళులే... అనుకుని తలుపు తీస్తే తీస్తారు లేకుంటే లేదు... ఇలా పిలుస్తూ తలుపుతట్టాననుకో సన్నిహితులై వుంటారనీ వెంటనే తలుపు తీస్తారు" అంటూ మళ్ళీ తలుపుతట్టి పిలిచాడు. వెంటనే తలుపులు తెరుచుకున్నాయి.

"చూసావా! ఇలాగా!" అంటూ పళ్ళికిలించాడు మామయ్య... పళ్ళికిలించడం కూడా కోతిలాగానే అని వేరే చెప్పక్కర్లేదనుకుంటాను.

అయితే రాజారాం మామయ్య కోతిలా



వుండదుగానీ, ఎర్రకోతి రంగులా వుంటాదు. పళ్ళికిలించినప్పుడు... కోపంతో చూస్తున్నప్పుడు మాత్రం ఎవరికైనా కోతి గుర్తుకొస్తుంటుంది. చేష్టల గురించి మళ్ళీ ప్రత్యేకంగా వేరే చెప్పక్కర్లేదనుకుంటాము.

తలుపు తెరచినావిడ మామయ్య వైపు అదోలా చూసింది. ఇంతకుముందు పరిచయమా?అన్నట్టు మామయ్య మాత్రం

ఎంతో పరిచయం వున్నట్టు "ఏమ్మా! చలపతి ఉన్నాడా!" అని అడిగాడు.

"ఆ స్నానం చేస్తున్నారు రండి! కూర్చోండి" అంటూ ఇంట్లోకి వెళ్ళడానికి దారి ఇచ్చింది. మామయ్య ఇంట్లోకి అడుగుపెట్ట బోతూ కాలింగ్‌బెల్‌ను రెండుసార్లు నొక్కి "అమ్మో! బాగానే పనిచేస్తోంది" అన్నాడు.

ఈ కోతి మామయ్య వెంట వుంటే దగ్గర సున్నమూ బెల్లమూ రెడీగా వుంచుకో వాలంటారు. ఆ మాటను ఇక్కడ నిజం చేయకుంటే ఎంతో బాగుండును అనుకుని నేను ఓ కుర్చీలో కూర్చున్నాను.

మామయ్య కూడా నాకెదురుగా వున్న కుర్చీలో కూర్చుని "ఇంతకూ చలపతి నీకేమవుతాడమ్మా?" అని అడిగాడామెను.

'కోతి' ప్రశ్నకు ఆమె సిగ్గుపడి చిన్నగా నవ్వుకుంది.

"పోనీ నువ్వు చలపతికేమవుతావో చెప్పు" అన్నాడు ఏదో పెద్ద క్లూ లాగబోతున్నట్టు

ఆమె మాత్రం ఎలాంటి సమాధానం ఇవ్వకుండానే ముక్తసరిగా ఇంట్లోకి వెళ్ళిపో యింది.

మా ఊళ్ళోకెల్లా 'సుమతి' కాన్వెంటు చాలా బావుంటుందనీ— అక్కడ అందరి పిల్లలకు చదువు బాగా అబ్బుతుందని మా ఊళ్ళో ప్రచారం బాగా వుంది. మా అబ్బాయిని ఎల్కేజీలో చేర్పిద్దామంటే సీటు దొరకదన్నారు. ఈ విషయం మా మామ య్యకు చెబితే— "ఆ కాన్వెంటు ప్రిన్సిపాల్ చలపతిగాడెవరనుకున్నావ్? నా క్లోజ్ ఫ్రెండ్! మూడు సంవత్సరాలు ఒకే చెట్టుమీద కోతి కొమ్మచ్చులాట ఆడుకున్నాం. ఆరో తరగతినుంచి పదో తరగతి వరకూ పక్కప క్కనే కూర్చుని చదువుకున్నాం... వాడిల్లు భగత్‌సింగ్‌నగర్‌లోనే కదా వుంది! రేపుద యం వాడింటికి వెళ్ళి మాట్లాడి పిల్లాడిని అడ్మిట్ చేయిద్దాం" అన్నాడు కోతి మామ య్య. ప్రయత్నించి చూద్దామని మామయ్య వెంట వచ్చానిక్కడికి.

"ఇప్పుడు కనిపించినావిడ చలపతి భార్య కాదా మామయ్యా?" అని అడిగాను. చలపతి చాలా క్లోజ్ అంటే భార్యను గుర్తుపట్టకపో డా .అని అనుమానం వేసింది. మరోవైపు చలపతి భార్య కూడా చాలా క్లోజ్‌గా వుండడంవల్ల తమాషాగా అడిగాడేమోనన్న సందేహం కూడా వచ్చిందనుకోండి.

"చలపతి భార్యను పెళ్ళి కూతురి గెటప్‌లో చూసాను... ఆ... ఆ... ఈవిడ చలపతి భార్యే! ఎందుకంటే చలపతి నీ కేమవుతాడని అడిగితే ఏమీ చెప్పలేదు... అంటే భార్యేనన్నమాట... వేరే ఇంకెవర యినా అవుతే నిస్సంకోచంగా... మామయ్య అనో, బావగారనో, బాబాయ్‌గారనో, అన్న య్యఅనో, మేనల్లుడనో చెప్పేది"

నేను విసురుగా ఓ నిట్టూర్పు విడిచాను. మామయ్య కుర్చీలోంచి లేచాడు. నాకెందు కో మళ్ళీ భయమనిపించింది. కోతి పని ఏం చేస్తాడోనని. నేననుకున్నట్టుగానే విజయశాం తి కేలండరును నఖశిఖ పర్యంతం చూసి జేబులోంచి పెన్ను తీసుకుని విజయశాంతికి మీసాలు దిద్దాడు. ఆ ఇంట్లో ఎవరికో 'విజయశాంతి' అభిమాన నటిలా వుంది... ఆమె తాలూకు నాలుగు క్యాలెండర్లు, వివిధ రకాలవి గోడలకు వేలాడుతున్నాయి. ఆ


ఇంటివాళ్ళు చూడకముందే మామయ్యని కూర్చోబెట్టాలన్న ఉద్దేశ్యంతో ''ష్! ప్లీజ్... ! ఇక్కడ కూర్చో మామయ్యా'' అన్నాను.

కోతిబుద్ధి! వింటే కదా! ఆ కేలండర్ మీదనే 'ఐ లవ్ యూ' అని మూడుసార్లు రాసి క్రింద 'చలపతి' అని రాసాడు. మరో కేలండర్‌లో విజయశాంతి బుగ్గన చూపుడు వేలు పెట్టుకున్న ఫోజులో వుంది. ఆ కేలండర్‌పై 'కిస్‌మీ..' 'కిస్ మీ' 'కిస్‌మీ' అని మూడుసార్లు రాసి విజయశాంతి అని రాసాడు.

నాకు గుండె వేగంగా కొట్టుకోవడం మొదలుపెట్టింది. ఇంటివాళ్ళు చూస్తే ఇంకేమైనా వుందా! అబ్బాయికి కాన్వెంటులో సీటులేకుంటే లేకపోయింది. పరువుగా బయటపడితే చాలనిపించింది.

కోతి మామయ్య ఇంకా ఏవి ఘనకార్యాలు చేస్తాడోనని బుగులుపట్టుకుంది. ''అన్నట్టూ ఈ రోజు ఆదివారం కదూ! 'కడప'లో సినిమా పాటలు వస్తాయి అంటూ దగ్గరే టేబిల్‌పై వున్న రేడియోను ఆన్ చేసాడు. ఈయనకు సినిమా పాటలంటే చాలా ఇష్టమే! అయినంత మాత్రాన పరాయి వాళ్ళింటికి వచ్చి రేడియో మీద హక్కులు పొందడమేమిటి! (చలపతి ఎంత క్లోజ్ (ఫ్రెండైతే మాత్రం?) మా కోతి మామయ్యకు మరో అలవాటు కూడా వుంది— ఘంటసాలగారి పాటవస్తే రేడియో వాల్యూం ఎంత పెద్దగా వుంటే అంత పెద్ద వాల్యూంను పెంచుతాడు. చిరంజీవి సినిమా పాటవస్తే చిరంజీవిలా స్టెప్స్ వేస్తున్నట్టు డాన్స్ చేస్తాడు... సుశీల, జానకి, చిత్ర పాడిన పాటలు వస్తే 'యుగళ గీతం' అంటూ ఆ పాటకు తన గొంతును కలుపుతాడు. ఈయన గొంతు కలిపితే అసలు గాయని స్వరమే వినిపించదు.

వచ్చిన వేళా విశేషం మంచిగా వుంది. కోతి మామయ్య రేడియోను ఆన్‌చేయగానే పవర్‌కట్ పుణ్యమా అని కరెంటుపోయింది మరోగంట వరకు కరెంటురాదని తెలుసు



కాబట్టి తెగసంబరపడిపోయాము.

మామయ్య కరెంటు పోవడంతో నిరుత్సాహంగా మొహం పెట్టి వచ్చి నా ప్రక్కనే వున్న కుర్చీలో కూర్చున్నాడు. కూర్చోగానే ఇప్పుడేం చేద్దాం మరి! అన్నట్టు పోజుపెట్టాడు. ఊరికే కూర్చుంటే అదే పదివేలు అన్నట్టు మామయ్య వంక చూసాను. ఊరకే ఉండడం నా జాతకంలోనే లేదన్నట్టు చూపులతోనే జవాబిచ్చాడు. నాకేమో కాస్త భయంగానే వుంది. చలపతికి గనక స్నానం చేయగానే, విజయశాంతి కేలండరును చూసే అలవాటే వుండివుంటే జరగబోయే సంఘటన ఎలా ఉంటుందా అని ఊహించుకోబోయి భయమేసి ఆగిపోయాను.

ఇందాక తలుపు తీసినావిడ... అవిడ చలపతి భార్యేలెండి... రెండు కాఫీ కప్పులతో మా ఎదురుగా వచ్చి నిలబడింది.

"ఇదేనా తల్లీ! మర్యాద?" మామయ్య అన్నాడు.

మర్యాదలో ఏం లోపం వుందో నా కర్థంకాలేదు. చలపతి భార్య మాత్రం అవాక్కైఅర్థం కాక మామయ్య వంక చూసింది.

"టిఫిన్ చేసేవేళ— టిఫిన్ లేకుండానే ఖాళీ కాఫీ ఇస్తే సరిపోతుందా?" అన్నాడు మామయ్య కాఫీ కప్పు అందుకుంటూనే.

"టిఫిన్ ఇంకా తయారు కాలేదు... అంతవరకు... కాఫీ తీసుకోండి" అంది చలపతి భార్య వినయంగానే. మామయ్య తత్వానికి మరోలా ఫీలవకండి అని చలపతి భార్యతో చెప్పాలనిపించింది. కానీ ఎలా ప్రస్తావించాలో తెలిక కంగారుపడ్డాను.

చలపతి భార్య లోపలికి వెళ్ళాక మామయ్య కాఫీ తాగుతూ "ఇంకేం! ఇక్కడ టిఫిన్ కూడా దొరుకుతుంది" అన్నాడు పెద్ద వరం దొరికినంత సంబరంగా.

అయిష్టతను వ్యక్తంచేస్తే వచ్చిన పనిని చిటికెలో చిన్నాభిన్నం చేసే సామర్థ్యం మామయ్యకుందని నాకూ బాగా తెలియడం మూలాన మామయ్య సంబరంలో పెద్ద సగం సంబరాన్ని నేనే పంచుకున్నట్టు నవ్వాను.

చూసి రమ్మంటే కాల్చివచ్చే రకమని మామయ్య నెరిగిన వాళ్ళందరూ అంటారు ఆయనకు ఆంజనేయుడో, హనుమంతుడో అని పేరు పెట్టాల్సిందని కొందరు సూచనలిచ్చారు కూడా... తోక ఒకటే తక్కువ అని ప్రసంగిస్తుంటారు కూడా...

మామయ్య గత జీవితంలో చేసిన కోతి పనులు నాకు బాగా ఎరుకే. వాటిని గురించి ఇప్పుడుచెప్పడం అప్రస్తుతమేననుకుంటున్నాను.

మామయ్య— కాఫీ కప్పును ఖాళీచేసి, ఏదో మరిచిపోయినట్టు ఒక్క వుదుటన లేచి నిలబడ్డాడు. ఒక్క నిమిషం ఖాళీగా వుండని ఈ మనిషితో అత్తయ్య ఎలా వేగుతుందో! ఆ... ఎలా వేగుతుంది! కోతి చేష్టలు సింహం ముందు ఏం పనికి వస్తాయి?

మామయ్య— ఎదురుగా గోడకు అమర్చిన అద్దం ముందుకువెళ్ళి తన ప్రతిబింబాన్ని తనివితీరా చూసుకున్నాడు... అద్దం ముందు 'చెక్క' మీద వున్న ఫెయిర్ అండ్ లవ్లీ ట్యూబ్‌ను తీసుకున్నాడు. ఆ ట్యూబ్ కొత్తదానికి మల్లేవుంది. నిశ్శంకోచంగా ట్యూబ్‌ను ఓపెన్‌చేసి మొహానికి రాసుకు

న్నాడు. ఎవరైనా వేలిమీద కొత్త పిందుకుని మొహం మీద అక్కడక్కడా అంటించుకుని చేత్తో మొహమంతా పూసుకుంటారు. కానీ మామయ్య అలా చేయలేదు. అరచేతినిండా పిండాడు. ట్యూబ్ సగానికి పైగా ఖాళీ అయింది. మొహానికి దట్టంగా పట్టించి మిగిలింది చేతులకు పూసుకున్నాడు... ఆ తరువాత అక్కడే వున్న టాల్కం పౌడర్ డబ్బాను అందుకుని మొహమ్మీద ఒలికించుకుని చేత్తో మొహం నిండాపట్టాడు.

మామయ్య టూమచ్‌గా వ్యవహరిస్తున్నాడు. పరాయి ఇల్లు... ఎంత వినయంగా వుండాలి... ఏదేనా అడిగి తీసుకోవాలి... అడగకపోయినా (పాత పరిచయం వున్నందుకు) స్వంతదారుడిలా దేన్నయినా వాడుకోవాలి. ఒక వెలరోజులకు సరిపోయే ఫెయిర్ అండ్ లవ్లీ ట్యూబ్‌ను ఒక్కసారికే సగానికి పైగా వాడేస్తే ఎలా!

నాకంతా అయోమయంగా వుంది... చలపతి ఎప్పుడు స్నానం ముగించుకొస్తాడా.. . విషయం కనుక్కుని మామయ్య చేసిన కోతి పనులను చలపతి చూడకముందే ఎప్పుడు వెళ్ళిపోదామా అన్న తొందర నాలో ఎక్కువైంది.

అయినా... చలపతి స్నానం ఇంకా ఎంతసేపు చేస్తాడు! ఇంకా రాడేమిటి? స్నానం తరువాత వెంటనే పూజలో కూర్చుంటాడేమో! ఆ తరువాత మరుక్షణమే టిఫిన్ పూర్తిచేసిగానీ బయటకు రాడేమో!

మామయ్య పౌడరు పూసుకున్నాకా— తరువాత ఏం చేద్దామా అని కాటుక డబ్బాని తెరచి చూసాడు... మగాడిక్కూడా ఎక్కడైనా ఉపయోగపడుతుందా అని కాస్సేపు ఆలోచించి మూతమూసి వుంచాడు.

ఆ తరువాత... పెన్సిల్‌లాంటిది తీసుకున్నాడు... అది పెదాలకు పూసుకునే రంగు పెన్సిలో కనుబొమ్మలు దిద్దుకునే పెన్సిలో తెలియదు కానీ దాన్ని కూడా తను వాడడానికి వీలుందా అన్నట్టు చూసాడు.

ఏదో స్ఫురణ కొచ్చినట్టు నల్లరంగైన ఆ పెన్సిల్‌తో గోడమీద అరచేతి సైజులో ఒక అమ్మాయి బొమ్మనుగీసి ఐలవ్‌యూ డార్లింగ్ అని రాసి చలపతి అని సంతకం చేసాడు.



## దేశంకోసం

"తనదేశంకోసం చావడం సైనికుడి కర్తవ్యం!" అన్నాడు ఓ సైనికాధికారి కొత్తగా చేరిన సైనికుడితో.

"కాదుసార్! తన శత్రువులు చనిపోవడం దేశానికి చాలా ముఖ్యం!" బదులిచ్చాడు తెలివిగా సైనికుడు.

—జోకర్ (హైదరాబాద్)

మామయ్యకు చెప్పకుండా బయటపడడ మే శ్రేయస్కరమనిపించీ కుర్చీలోంచి లేవ బోతుండగా మామయ్య నేరుగా లోపలిగది లోకి వెళ్ళాడు. అక్కడ మరేం కోతి పనులు చేస్తాడో? ఆయన్నిలాగే వదలివెడితే ఆయన చేష్టలకు వీపు పచ్చడవుతే? వెంట వెళ్ళి తన్నులు తినిపించాడని లోకం నిందవేస్తుంది కదా అని ఎప్పటిలా కుర్చీలో కూర్చుండిపో యాను.

అరనిముషంలోనే మామయ్య బయటి గదిలోకి వచ్చాడంటే ఎలాంటి కోతిచేష్టలు చేయలేదనే అనుకోవచ్చు. మామయ్య ఇం ట్లోంచి చలపతి కొడుకుని ముద్దాడుతూ ఎత్తుకొచ్చాడు. ఆ అబ్బాయికి ఏడాది వయస్సుండవచ్చు. చాలా నల్లగా వున్నాడు... ఆ... ఫెయిర్ అండ్ లవ్లీ క్రీం ఈ అబ్బాయి కోసమే కొన్నారని అర్థమైపోయిం ది నాకు... మామయ్య ముద్దుపెట్టుకున్నా డు కానీ ఆ అబ్బాయి నాకు ముద్దుగా అనిపించలేదు.

చలపతిగారేం చేస్తున్నారింకా?'' అడిగా ను మామయ్యను.

''ఇప్పుడే పూజలో కూర్చున్నాడట... వాడిపూజ పదినిముషాలకు తక్కువలో పూ ర్తికాదని వాడి భార్య చెప్పింది... మన కోసం... ఆవిడ వడలు చేయడానికి ఉపక్ర మిస్తోంది... ఆవిడకు డిస్ట్రబెన్స్ లేకుండా వుంటుందని మనకు టైంపాస్‌గా వుంటుం దని పిడినెత్తుకొచ్చాను... అంటూ పిల్లాడిని నా ఒడిలో కూర్చోబెట్టాడు. నాకైతే నా వడిలో కాకిపిల్ల కూర్చున్నట్టే అనిపించింది. (కాకి పిల్ల కాకికి ముద్దు అంటారు కానీ... ఏ కాకి పిల్ల ఆ కాకికే ముద్దని మీతో మనవి చేస్తున్నాను) కొందరు పిల్లలు నల్లగా వున్నా ముద్దుగా బొద్దుగా వుంటారు. కానీ ఈ పిల్లవాడు కాస్తా కాకి నలుపే అని చెప్పవచ్చు. పైగా ఏదో వ్యాధితో ఉన్నట్టు పీలగా వున్నాడు.

కోతి మామయ్య అక్కడేవున్న అలమా రా తెరిచాడు. అలమారాలో బొమ్మలు, టార్చిలైటు, మొదలైన వస్తువులతోపాటు ఒక టానిక్ బాటిల్ కూడా వుంది. మామయ్య ఏదో ఓ బొమ్మను తీసుకుని ఈ పిల్లవాడిని ఆడించవచ్చనుకున్నాను. కానీ టానిక్ బాటిల్‌ను చేతిలోకి తీసుకుని... ''ఒరేయ్! అల్లుడు! ఈ టానిక్ పేరు నోట్‌చేసుకోరా! మనమూ వాడుదాం... చలపతి, స్ట్రాంగ్‌గా ఫైల్‌మాన్‌లా ఎందుకు తయారయ్యాడో ఇప్పుడు తెలిసింది. ఈ టానిక్ మహిమేనన్నమాట...'' అంటూ టానిక్ బాటిల్ ఓపెన్‌చేసి దాదాపుగా బాటిల్‌లో పావుభాగం వున్న టానిక్‌ను ఒక్క గుటకలో ఖాళీచేసాడు.

వెంటనే ఆముదం తాగినట్టు మొహం పెట్టాడు. ఎందుకు మొహమలా పెట్టాడు ? కొంపదీసి ఎక్స్‌పైర్ అయిన టానిక్ అవుతే కాదు కదా అని లేచి వెళ్ళి బాటిల్‌ను పరీక్షించాను. ఎక్స్‌పైరీ డేట్ జూలై 91 వరకు వుంది... అంటే ఇంకో సంవత్సరం వరకు వాడవచ్చన్నమాట... అది మల్టీపుల్ విటమిన్ టానిక్.

మామయ్య హాల్లోవున్న (మేమున్నదే) స్కూటర్‌పై కూర్చున్నాడు... స్టార్ట్‌చేసి చూస్తాడేమోనని భయం వేసింది... స్టార్ట్ చేయకపోయినా చిన్న చిన్న పార్ట్సు లూజుచేసి

మళ్ళీ వైట్ చేస్తాడేమోననిపించింది. నాకు వెంటనే ఒక ఆలోచన వచ్చింది. "మామయ్యా కాస్త ఈ బాబును ఎత్తుకోవా! నేవలా కాస్త బయటికి వస్తాను" అని చిటికెన వేలు చూయించాను. మామయ్య బాబువెత్తుకుంటే కాస్సేపైనా కోతి పనులు మానుకుంటాడని నా అభిప్రాయం.

మామయ్య బాబును ఎత్తుకొని.. గాల్లో ఆడిస్తూ... "కిచ్! కిచ్! కిచ్! ప్! ప్! ప్' అన్నాడు. పాపం నేను చేయాలనుకున్న పనిని ఆ బాబు చేసాడు. అదే... చిటకవేలు పని! పాపం! మామయ్య మొహంతోపాటు చొక్కాకూడా తడిసిపోయింది. లవ్అండ్ ఫేర్లీ, టాల్కం పౌడర్...అన్నీ బూడిదలో పోసిన పన్నీరులా అయ్యాయి.

చలపతి భార్య, ఖాళీ కప్పులను తీసుకోవడానికి హాల్లోకి వచ్చి మామయ్య పరిస్థితిని చూసి లోలోన చిన్నగా నవ్వుకుని "వెధవా! నీకు అంకుల్ మొహమే దొరికిందా?' అని బాబును ఎత్తుకుని "చొక్కా ఇటివ్వన్నయ్యా... ఉతికిస్తాను..." అంది...

"ఆ... ఆ... ఫరవాలేదులేమ్మా! సబ్బు పెట్టి మొహం కడుక్కుంటాను... కాస్త బాత్‌రూం చూయించు" అని ఆమె వెంట దారితీసాడు మామయ్య.

రెండు నిముషాల్లో మామయ్య మొహం కడుక్కుని వచ్చాడు. పిల్లాడి మూత్రం పడిన చోట చొక్కాను కూడా పిండుకున్నాడు... "ఒరేయ్ కృష్ణలో రెండు మునకలు మునిగితేగానీ ఈ అపవిత్రం పోయేటట్టులేదు. చలపతిగాడిని కలిసి నేను వెంటనే కృష్ణకు వెళ్ళొస్తాను" అన్నాడు (కృష్ణానది ఇక్కడికి కేవలం పదికిలోమీటర్ల దూరంలో వుంది... బస్సు సౌకర్యం కూడా వుంది)

అప్పుడే చలపతి హాల్లోకి వచ్చాడు... పూజ ఇప్పుడే ముగించుకున్నట్టు ఆ బొట్టూ. గడ్డం కింద చందనం చెబుతున్నాయి.. మామయ్య చెప్పినట్టుగా చలపతి ఏమి దృఢంగాలేదు. పిల్లవాడి లాగానే చాలా వీక్‌గా వున్నాడు. మామయ్యను తనను చూసి "ఏం పనిమీదొచ్చారు!" అని అడిగాడు. మామయ్యకు చలపతి క్లోజ్ గనుక



## ఉత్తర ప్రియులు

ప్రపంచంలో అతి ఎక్కువగా ఉత్తరాలు ఎవరు రాస్తారో తెలుసా? అమెరికన్లట! వారు ప్రతిరోజూ సగటున తలొక ఉత్తరాన్ని రాస్తూ ఉంటారు. అయితే మన దేశంలో మాత్రం ప్రతి 30 మందిలో ఒకరు మాత్రమే ప్రతిరోజూ ఉత్తరాల్ని రాస్తూ ఉంటారు! అంటే ఉత్తరాలు రాసే వారి సంఖ్య మనదేశంలో అక్షరాస్యత శాతం లాగానే అతితక్కువన్నమాట! మనం కూడా అమెరికన్ల లాగా ఉత్తరాలు రాయాలంటే... అందరూ వెంటనే బళ్ళో కెళ్ళటం మొదలెట్టాలి! అలా అందరూ అక్షరాస్యులైపోతే... మన రాజకీయ నాయకుల ఆటలు సాగుతాయంటారా?

—జూపిటర్

మామయ్య విషయం ప్రస్తావిస్తాడని నేను నోరు తెరువలేదు.

"మవ్వెవరోయ్! ఇంతకూ చలపతిగాడే డి?" రుబాబుతో అన్నాడు మామయ్య.

"నేనే చలపతిని" అన్నాడతను.

"పరాచికాలకు
వేళా పాళావుండాలోయ్"


"నేనే చలపతిని అంటుంటే... మీ పరాచికాలేమిటి?... ఒళ్ళు తిమ్మిరెక్కిందా?... బొక్కలో తోయించి ఎముకలు విరగ్గొడ్తాను...' అని ఇంట్లోకి భార్యనుద్దేశించి... "ఏమేవ్! నా యూనిఫాం పట్టా!" అన్నాడు. ఆమె యూనిఫాం తెచ్చాక అర్థమైంది... ఈ చలపతి కానిస్టేబుల్ అని.

"సారీనోయ్! వీధిలో 'చలపతి ఇల్లేది' అని అడిగితే ఈ ఇంటిని చూపించారు... మాక్కావాల్సిన చలపతి నీవు కావని తెలిసిపోయింది" అన్నాడు మామయ్య నాలిక్కరచుకుని.

"పొద్దున్నే భలే బేరం దొరికింది... నేను 'చింతకుంట' కేసు వ్యవహారంలో మామూళ్ళివ్వడానికి వచ్చిన తాలూకు అనుకుని మా ఆవిడచేత దండగ కాఫీ ఇప్పించాను" అంటూ ముద్దపువేసుకుని..."ఇంతకూ మీకే చలపతి కావాలి?" అని అడిగాడు. నేను ఏ చలపతి కావాలో చెప్పాను..." ఆయనది.. ఆ రెండోవీధిలో మూడో ఇల్లు" ఇక దయచేయవచ్చు అన్నట్టు అన్నాడు...

ఆయన ఇంకా కాలెండరు వైపు, లవ్ అండ్ ఫెయిల్ క్రీంవైపు, టానిక్ బాటిల్ వైపు చూడకముందే వెళ్ళడం మంచిదని మెల్లగా జారుకోబోతుండగా చలపతి అల మారా తెరచి టానిక్ బాటిల్ తీసుకున్నాడు... తాగడానికి కాబోలు... నాగుండె గతుక్కుమంది. చలపతి ఇంట్లోకి దృష్టిని సారించి "ఏమేవ్! అబ్బాయి మూత్రాన్ని పరీక్షించేందుకు ఈ టానిక్ సీసాలో పట్టిపెట్టానన్నావుగా... సీసా ఖాళీగానే వుంది కదా!" అని అన్నాడు పెద్దగా...

నేను మామయ్య వంక చూసాను... ఆయనను వర్ణించడం నా తరమగునా?



డిజైన్: ఇ. కృష్ణకుమారి (ఖమ్మం)